

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ సర్కార్ పనిచేస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ బి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. 8లో▸



చౌక దుకాణం నామమాత్రం!

దోమ మండలం పరిధి 36 గ్రామ పంచాయతీల్లో 34 చౌక ధరల దుకాణాలు ఉండగా.. 13,115 రేషన్ కార్డులు ఉన్నాయి. 9లో▸



జాడలేని చినుకు..

చినుకు జాడ లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

టీటీడీ బోర్డులో సీతారంజిత్‌రెడ్డికి చోటు



సీతారంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డికి చోటు దక్కింది. ఈ మేరకు ఆమెకు తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

కెమిస్ట్రీ బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి శివారులోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో రసాయన శాస్త్రం(కెమిస్ట్రీ) బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రకాశ్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8096 2266 51 నంబర్‌లో సంప్రదించాలన్నారు. డెమో ఆధారంగా ఎంపిక ఉంటుందని చెప్పారు. వీరికి గంటల ప్రాతిపదికన వేతన చెల్లింపు ఉంటుందని వివరించారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచుకోండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శివలీల

యాలాల: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తాండూరు సివిల్ కోర్టు జూనియర్ న్యాయమూర్తి శివలీల అన్నారు. మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగొద్దని సూచించారు. కళాశాల స్థాయి నుంచే న్యాయవ్యవస్థ, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, న్యాయవాదులు శ్రీనివాస్, విశ్వనాథ్, రామయ్యగౌడ్, నరేందర్, యాద్రామి విశ్వనాథ్, రవికుమార్, గోపాల్, నరేందర్‌రెడ్డి, సోఫియాబేగం, అనితగుప్త, ఎస్‌ఐ అరవింద్‌కుమార్, కాలేజీ ప్రిన్సిపల్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

30వేల మొక్కలు నాటుతాం

ఉద్యానవనశాఖ జిల్లా అధికారి చక్రపాణి



అంతారం తండాలో మొక్క నాటుతున్న చక్రపాణి

తాండూరు రూరల్: భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా మండల పరిధిలో 30 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని అంతారం తండాలోని ఫారెస్ట్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతారం తండా, జినుగుర్తి, ఉద్దండాపూర్ తదితర గ్రామాల్లో మొక్కలు నాటుతామని చెప్పారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఎంపీఓ రతన్‌సింగ్, ఏపీఓ నరోత్తంరెడ్డి, ఏపీఎం ఆనంద్, ఏఓ రజిత ఉన్నారు.

డీటీ ధనుంజయ్‌కు పదోన్నతి

తాండూరు రూరల్: మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ్‌కు తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. ఈ క్రమంలో ఆయన బదిలీపై గద్వాల జిల్లాకు వెళ్లారు. ఇటీవలే ఎలక్షన్ డీటీగా విధుల్లో చేరిన శ్రీనివాస్‌రావుకు కూడా పదోన్నతి రావడంతో ఆయన సైతం వెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి.



సభకు తరలివచ్చిన పార్టీ శ్రేణులు

కాంగ్రెస్.. ఫుల్ జోష్



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నేతలు





ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్, కళాకారుల ఆటాపాట

'ప్రజాగర్జన' సక్సెస్

- భారీగా తరలివచ్చిన జనం
- ఉత్సాహం నింపిన ప్రముఖుల ప్రసంగాలు
- సభ విజయవంతంతో నేతల సంతృప్తి

చేవెళ్ల/మొయినాబాద్/శంకర్‌పల్లి/మొయినాబాద్ రూరల్: చేవెళ్ల వేదికగా కాంగ్రెస్ నిర్వహించిన 'ప్రజాగర్జన' సభ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు. సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో ప్రధాన రహదారిపై డివైడర్‌పై ఎక్కి సభను వీక్షించారు. రోడ్లపైనే నిలబడి నేతల ప్రసంగాలను విన్నారు. జై కాంగ్రెస్ అన్న నినాదాలు మిన్నంటాయి. ఊహించినదానికంటే పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

దాదాపు నాలుగంటలపాటు సభ..

ముందుగా ప్రకటించిన ప్రకారం సాయంత్రం 4 గంటలకు సభ ఉంటుందని ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాత్రి 8.30 గంటలకు వరకు సభలోనే కనిపించారు. సభా వేదికపై నేతల స్పీచ్‌లే సుమారు 2 గంటలపాటు కొనసాగాయి. ప్రముఖుల ప్రసంగాలను ప్రజలు ఆసక్తిగా విన్నారు.

పార్టీలో చేరిన ఆర్మూర్ నేతలు

చేవెళ్ల సభలో ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన గోవర్ధన్, మహిపాల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ఓయూకు చెందిన కాట శ్రీనివాస్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి స్వాగతించారు.

గద్దర్‌కు ఘన నివాళి

సభలో ప్రజాగాయకుడు గద్దర్‌కు మల్లికార్జున ఖర్గే, రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ శేణులంతా కలిసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని.. కేసీఆర్‌ను గద్దె దించాలనే గద్దర్ చివరిసారిగా చేసిన సందేశం మాటలను మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సెల్‌ఫోన్ ద్వారా మైకులో కార్యకర్తలకు వినిపించారు.

బీసీలకు న్యాయం జరగాలి

అరశాతం ఉన్నవారు తెలంగాణ రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని.. 54 శాతం ఉన్న బీసీలకు కూడా న్యాయం జరగాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు హన్మంతరావు అన్నారు. హైదరాబాద్‌లోని గోషామహల్‌లో బందీ అయి ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా నిలబెట్టేందుకు పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

కళాకారుల ధూంధాం..

సభకు వచ్చిన జనవాహినిని ఆకట్టుకునేలా కళాకారుల ధూంధాం పాటలు మార్మోగాయి. ఆద్యంతం తమ ఆటపాటలతో అలరించారు. సభ జరుగుతున్న సమయంలో వాతావారణం ఒక్కసారిగా మారిపోయి వర్షం పడే పరిస్థితి కనిపించింది. దీంతో 12 అంశాలను త్వరగా చదివి ముగించారు. సభలో పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మాజీ మంత్రులు ప్రసాద్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి చుక్కెదురు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీకి చుక్కెదురయింది. రెండో విడత పంపిణీకి జీవాలు దొరకడం లేదని చెబుతూ ప్రభుత్వం కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ వేస్తోంది. నిధుల లేమితోనే పంపిణీ నిలిచిపోయిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

- వాయిదా పడుతున్న రెండో విడత
- 11,583 యూనిట్లకుగాను 200 మాత్రమే పంపిణీ
- జీవాలు దొరకడం లేదని చెబుతున్న అధికారులు
- నిధులు విడుదల చేయలేదని ప్రతిపక్షాల ఆరోపణ
- ఆందోళనలో గొల్లకుర్మలు



వికారాబాద్: యాదవులు, గొల్లకుర్మలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు రాష్ట్రంలో మాంసాహార ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం 2017లో గొర్రెల యూనిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ పథకాన్ని రెండు విడతలుగా అమలు చేయాలని నిర్ణయించిన సర్కారు.. మొదటి విడతలో 50శాతం , రెండో విడతలో 50శాతం యూనిట్లు పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందించింది. సొసైటీలుగా ఏర్పడి, సభ్యులుగా నమోదై 18 సంవత్సరాలు నిండిన గొల్ల కుర్మలకు ఒక యూనిట్ చొప్పున పంపిణీ ప్రారంభించింది. గొర్రెల కాపరులు తమ వాటాగా 25 శాతం డబ్బులు, ప్రభుత్వ వాటా 75శాతం నిధులు కలెక్టర్ ఖాతాలో జమచేసి జీవాలు కొనుగోలు చేసి గొల్ల కుర్మలకు అందజేస్తున్నారు.

'అధికారులు చెప్పేది అబద్ధం'

రెండో విడత గొర్రెల పంపిణీ వ్యవహారం ఇవ్వాల్సింది కొండంత.. ఇచ్చింది గోరంత అన్న చందంగా తయారయింది. ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని కుర్మలు సంతోషించేలోపే కొత్త అడ్డంకులు వస్తున్నాయి. జూన్ 9న గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉండగా కొనుగోలుకు జీవాలు దొరకక కార్యక్రమం వాయిదా పడుతూ వచ్చింది. గొర్రెల కొనుగోలుకు ఇటీవల కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు వెళ్లిన అధికారుల బృందం ఉట్టి చేతులతో తిరిగి వచ్చారు. తిరిగి జూలైలో పంపిణీ ప్రారంభించగా.. 200 యూనిట్లకే పరిమితమయింది. మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,477 యూనిట్ల పంపిణీ చేయగా.. రెండో విడతలో 11,583 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. అధికారులు 200 యూనిట్లు పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రభుత్వం నిధులివ్వకపోవడంతోనే పంపిణీ నిలిచిందని.. గొర్రెలు దొరకడంలేదని అధికారులు చెబుతున్నదంతా వట్టిదేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఫ్రీజింగ్ నిధులతో పంపిణీ

బడ్జెట్ విడుదల చేస్తున్నామని ప్రభుత్వం చెబుతూ వస్తున్నప్పటికీ రెండో విడత గొర్రెల పంపిణీ కోసం జిల్లాకు రావాల్సిన బడ్జెట్ విడుదల కాలేదు. మొదటి విడతలో కొందరికి చివరి నిమిషంలో పలు కారణాలతో పంపిణీ నిలిచి పోగా.. దానికి సంబంధించి రూ.2 కోట్ల నిధులు కలెక్టర్ ఖాతాలో ఫ్రీజింగ్‌లో ఉన్నాయి. వాటితో ప్రస్తుతం రెండో విడత పంపిణీ ప్రారంభించారు. మిగిలిన యూనిట్ల పంపిణీకి ప్రభుత్వం నిధులు విడుదల చేసేవరకు వేచి చూడాల్సి వస్తోంది. దీంతో రెండో విడత పంపిణీ మూడడుగులు ముందుకు.. ఏడడుగులు వెనక్కు అన్న చందంగా తయారయింది.

రెండో విడత పంపిణీ లక్ష్యం 11,583 యూనిట్లు

జిల్లా వ్యాప్తంగా 311 గొర్రె కాపరుల సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 22,025 మంది సభ్యులున్నారు. 2017–18లో ప్రారంభించిన పథకంలో 2018 జూన్ చివరినాటికి 10,078 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేశారు. మొదటి విడతలో మిగిలిపోయిన యూనిట్లతో పాటు కొత్తగా ఏర్పడిన దుద్యాల, హకీంపేట్, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఐదు గ్రామాలు కలిపి రెండో విడతలో మొత్తం 11,583 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. రెండో విడత గొర్రెల పంపిణీ పథకం కోసం జిల్లాకు మొత్తం రూ.202.27 కోట్ల బడ్జెట్ అవసరం . ఇందులో రూ.152.02కోట్లు ప్రభుత్వం చెల్లిస్తుండగా రూ.50.67 కోట్లు తమ వాటాగా గొల్ల కుర్మలు చెల్లించాల్సి ఉంటుంది.



పరిగి 3వ వార్డులో మొక్క నాటి నీరుపోస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ప్రతీ మొక్కను సంరక్షించాలి

'కోటి వృక్షార్చన'లో కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి: భావితరాలకు ఆహ్లాదమైన జీవన విధానాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం కోటి వృక్షార్చన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలో 3వ వార్డులో, మండల పరిధిలోని సాలిపూలబాట తండాలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డితో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ప్రభుత్వం ఒకే రోజు కోటి మొక్కలు నాటేందుకు కోటి వృక్షార్చన కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా 5.30లక్షల మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పరిగి మున్సిపాలిటీ పరిధిలో 5వేల మొక్కలు, సాలిపూలబాట తండాలో 30వేల మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి మొక్కను సంరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

కోటి వృక్షార్చనకు హాజరైన కలెక్టర్ పట్టణ కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ నెం–1 పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు పంపిణీ చేస్తున్న రాగి జావ రుచి చూసి బాగుందని కితాబిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు చెప్పారు. ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. వయోజనులు ఓటు హక్కు పొందేలా బీఎల్‌ఓలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అధికారం చేపట్టేది కాంగ్రెస్ ప్రభుత్వమే



డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాగర్జన సభకు తరలిన నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: వచ్చే ఎన్నికల్లో అధికారం చేపట్టేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్లలో నిర్వహించిన ప్రజాగర్జనకు ఆయన తన నివాసం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న ప్రజాగర్జన సభతో రాజకీయ పరిణామాలు మారుతాయన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు రెండూ ఒకటేనని, తెలంగాణ ప్రజలు ఆ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ డీఎస్పీగా హన్మంత్‌రావు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

అనంతగిరి: జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో విభాగం డీఎస్పీగా హన్మంత్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ కార్యాలయంలోని ఎస్పీ కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మా బిడ్డ జాడ చెప్పండి

అబ్దుల్లాపూర్‌మెట్: కళాశాల హాస్టల్ నుంచి తమ కుమారుడు అదృశ్యమై వారం రోజులు గడుస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని బాధిత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి మిస్సింగ్‌కు యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ శనివారం స్టూడెంట్ యూనియన్లతో కలిసి ఆందోళన చేపట్టారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ విద్యాసంస్థల్లో డిప్లొమా సెకండియర్ చదువుతున్న ఆంజనేయులు .. ఈనెల 20న కళాశాలకు చెందిన హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. వారం రోజులుగా కుమారుడి జాడ లేకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు, యాజమాన్యం స్పందించి ఆచూకీ తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థి నాయకులు

క్లుప్తంగా

చిన్నమేగ్యనాయక్ తండాలో డెంగీ కేసు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం చిన్నమేగ్యనాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో భాగ్యమ్మకు డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. జ్వరంతో బాధపడుతున్న ఓ మహిళ ఇటీవల మహబూబ్‌నగర్‌లో పరీక్షలు చేయించుకోగా శనివారం ఉదయం వచ్చిన రిపోర్ట్‌లలో డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మెడికల్ అసిస్టెంట్ శరభలింగం ఆధ్వర్యంలో బాధితురాలి ఇంటిని పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు తీసుకున్నారు. గ్రామంలో సైతం పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాల్సిందిగా పంచాయతీ పాలకవర్గానికి సూచించారు.

టీటీడీ బోర్డు మెంబర్‌గా సీతారంజిత్‌రెడ్డి



రంజిత్‌రెడ్డి దంపతులను సన్మానించిన బీఆర్‌ఎస్ నాయకులు

బంట్వారం: టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమితులైన ఎంపీ రంజిత్‌రెడ్డి భార్య సీతారంజిత్ రెడ్డికి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, నాయకులు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. కోట్‌పల్లి మండల అధ్యక్షుడు అనిల్, సర్పంచ్‌ల సంఘం మండలఅధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్ ఉన్నారు.

పురుగులమందు తాగి..

పొదుపు సంఘం లీడర్ ఆత్మహత్య

ధారూరు: మహిళా పొదుపు సంఘం సభ్యులంతా డబ్బులకై దబాయించడంతో మనస్తాపానికి గురై పురుగులమందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధారూరు మండలం హరిదాస్‌పల్లిలో శనివారం వెలుగు చూసింది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. హరిదాస్‌పల్లి గ్రామానికి చెందిన గట్టెపల్లి బాబమ్మ గ్రామ మహిళా పొదుపు సంఘంలో మొదటి లీడర్. ఇటీవల లీడర్లకు, సభ్యులకు డబ్బుల విషయంలో వివాదం చోటుచేసుకుంది. ఇతరులతో మాకు సంబంధం లేదు, మాకు డబ్బులు ఇవ్వాలని సంఘంలోని కొంతమంది సభ్యులు పట్టుబట్టగా మనస్తాపానికి గురైన బాబమ్మ శనివారం పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దొంగలంటూ అనుమానం..

- పిలిచినప్పుడల్లా పీఎస్‌కు రావాలని పోలీసుల ఆదేశం
- అవమానభారంతో వ్యక్తి ఆత్మహత్య



డేవిడ్ (ఫైల్)

ధారూరు: సర్పంచ్, గ్రామస్తులు తనపై దాడిచేయగా.. ఎక్కడ పోలీస్ కేసు అయ్యి పరువు పోతుందనే భయంతో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రామకృష్ణ, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు గ్రామానికి చెందిన కల్లూరి డేవిడ్(23) అతని ఇద్దరు మిత్రులు కలిసి ఈనెల 24న సాయంత్రం పరిగి మండలంలోని బసిరెడ్డిపల్లికి వెళ్లారు. గ్రామంలోకి కొత్తవారు రావడం చూసిన ప్రజలు వారిని దొంగలుగా భావించి వారిని నిర్బంధించారు. అనంతరం సర్పంచ్, గ్రామస్తులు.. డేవిడ్, అతని మిత్రులను పోలీసులకు అప్పగించారు. వారిని మందలించిన పోలీసులు దొంగలా కాదా తేల్చేందుకు ఎప్పుడు పిలిచినా వెంటనే పీఎస్‌కు రావాలని సూచించి ఇంటికి పంపించారు. ఇంటికి వచ్చిన డేవిడ్ అవమనభారంతో శనివారం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



మోమిన్‌పేట: నందివాగు ప్రాజెక్టులో చేపలను వదులుతున్న విజయ్‌కుమార్

మోమిన్‌పేట: రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ సర్కార్ పనిచేస్తోందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని నందివాగు ప్రాజెక్టులో 1.90లక్షల చేప పిల్లలను రాష్ట్ర మత్స్యకారుల సంఘం ఉపాధ్యక్షుడు దిట్టి మల్లయ్య, డీఎఫ్‌ఓ చరితారెడ్డితో కలిసి ఆయన వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కులవృత్తులను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. కులవృత్తుల వారిని లక్షాధికారులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల మత్స్యశాఖ అధికారి సౌజన్య, ఎంపీటీసీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు శశిధర్‌రెడ్డి, సత్యమ్మ, ఎంపీడీఓ శైలజారెడ్డి, జిల్లా సహకార సంఘం ఆడిటర్లు అంజయ్య, అనంతయ్య, మోమిన్‌పేట మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రాజు, సభ్యులు అంబదాసు, అశోక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వేయి మొక్కలు..

మోమిన్‌పేట: వాతావరణ సమతుల్యతతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మేకవనంపల్లిలో హరితహారంలో భాగంగా కోటి మొక్కల నాటడం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హరితహారం కార్యక్రమంలో ప్రతి సంవత్సరం మొక్కలు నాటుతున్నామన్నారు. కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి గ్రామంలో వేయి మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శశిధర్‌రెడ్డి, ఎంపీడీఓ శైలజారెడ్డి, ప్రత్యేకాధికారి చరిత, ఎంపీఓ యాదగిరి, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



కొడంగల్: అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

కొడంగల్: మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ శనివారం పరిశీలించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని 8 మండలాల్లో 275 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. కొడంగల్ మండలంలో 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహశీల్దార్ సురేష్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన..

కుల్కచర్ల: రానున్న అసెంబ్లీ ఎన్నికలు నిర్వహణకు పోలింగ్‌బూత్‌లలో అన్ని సౌకర్యాలు ఉండేలా ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలని వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి అన్నారు. శనివారం చౌడాపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పర్యటించి పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని ఎదైనా పోలింగ్ కేంద్రంలో ఇబ్బందులు ఉంటే మార్పులు చేర్పులను త్వరితగతిన నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మేకలమందపై కుక్కల దాడి..

18 మేకలు మృతి

అనంతగిరి: మేకలమందపై కుక్కలు దాడిచేసిన ఘటనలో 18 మేకలు మృత్యువాత పడిన సంఘటన వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వంశరాజుల నర్సింహులు, రాములమ్మకు చెందిన మేకలమందపై శుక్రవారం రాత్రి కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడిన 18 మేకలు మృతి చెందాయి. సుమారు రూ.6లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్

షోలాపూర్ ఎమ్మెల్యే సిద్ధి రామప్ప



మోమిన్‌పేట: మాట్లాడుతున్న విజయసిద్ధి రామప్ప

మోమిన్‌పేట: కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లాలని షోలాపూర్ ఎమ్మెల్యే విజయ సిద్ధి రామప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి అధ్యక్షతన శనివారం వికారాబాద్ నియోజకవర్గ ప్రవాస్ యోజన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..కేంద్ర పథకాలను రాష్ట్రం తమవిగా చెప్పుకొంటుందని ఆరోపించారు. తెలంగాణలో తప్పకుండా డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడు, నియోజకవర్గ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి ఎదురుగాలి..

తాండూరు: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి ఎదురుగాలి వీస్తోందని.. సొంత పార్టీ నేతలే ఆ పార్టీని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్సీ సతీష్‌కుమార్ జోస్యం చెప్పారు. శనివారం తాండూరు బీజేపీ కార్యాలయంలో రైల్వే పీఏసీ మెంబర్ ఉమారాణితో పాటు స్థానిక నాయకులతో కలసి ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను సీఎం కేసీఆర్ విస్మరించారన్నారు. త్వరలోనే తాండూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున బీజేపీలో చేరికలుంటాయన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరుతో పాటు రాష్ట్రంలో బీజేపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీకృష్ణగౌడ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సాహుశ్రీలత, బీజేపీ నాయకులు రమేష్‌కుమార్, నరేష్‌మహరాజ్, రజినీకాంత్ తదితరులున్నారు.

చోరీలు చేస్తారు.. జనాల్లో కలిసిపోతారు

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టించిన పోలీసులు
- మోర్ సూపర్ మార్కెట్ చోరీ కేసు విచారణతో గుట్టు రట్టు
- గత నాలుగు నెలల్లో ఆరు చోరీలు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శేఖర్‌గౌడ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్



స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులు

తాండూరు టౌన్: చోరీలకు పాల్పడుతూ గుట్టు చప్పుడు కాకుండా తమ గ్రామాలకు వెళ్లి యథావిధిగా తమ పనులు చేసుకుంటూ తప్పించుకు తిరుగుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టును తాండూరు పోలీసులు రట్టు చేశారు. తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్, పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డితో తెలిపిన వివరాలు.. ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత తాండూరు పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్‌లో చోరీ జరిగింది. రూ.2లక్షలకు పైగా నగదును దొంగలు ఎత్తుకెళ్లిన విషయం విదితమే. విచారణలో భాగంగా సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసలు దొంగలను గుర్తించారు. కర్నాటక రాష్ట్రం సిల్దర్ కోట్ గ్రామానికి చెందిన కొరుకు నవీన్, కుర్వ శ్రీనివాస్, సుగాల సంజీవ 21వ తేదీన తాండూరులోని మోర్ సూపర్ మార్కెట్ షటర్ తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. లాకర్‌లో ఉన్న రూ.2లక్షల నగదుతో పాటు అక్కడే ఉన్న ఫోన్‌ను దొంగిలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని శనివారం అరెస్టు చేశారు. ఈ ముగ్గురితో పాటు సంజు అనే మరోవ్యక్తి కూడా చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు నెలల్లో ఆరు చోరీలు..

గతంలోనూ కొడంగల్‌లోని బట్టల, బంగారు, మొబైల్ దుకాణాల్లో వీరు చోరీలకు పాల్పడ్డారు. అలాగే ముదోల్‌లోని రెండు కిరాణా దుకాణాల్లో రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇలా నాలుగు నెలల వ్యవధిలో ఆరు దొంగతనాలు చేశారు. కాగా శనివారం నవీన్, శ్రీనివాస్, సంజీవను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.2.10 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు, రూ.40వేల విలువైన బట్టలు, ఒక లాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో నిందితుడు డబ్బా సంజు పరారీలో ఉన్నాడు. శనివారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రాజేందర్ రెడ్డి, ఎస్ఐ అబ్దుల్ రవూఫ్, కానిస్టేబుళ్లు అమ్జద్, శివ, సాయి, షాబీల్, వెంకట్రాములును డీఎస్పీ అభినందించారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి



కొడంగల్ రూరల్ : మొక్క నాటుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, రాహుల్ శర్మ

కొడంగల్ రూరల్: ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. మండల పరిధిలోని పోశమ్మతండా గ్రామ శివారులో స్వతంత్ర భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని శనివారం మొక్కలు నాటారు. మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, ఎంపీడీఓ పాండు, సర్పంచ్ శంకర్‌నాయక్, ఫారెస్టు అధికారి రతన్‌సింగ్, మండల ప్రత్యేక అధికారి సారంగపాణి, ఏపీఓ రాములు, ఎంపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కను రక్షించాలి..

వికారాబాద్ అర్బన్: నాటిన ప్రతి మొక్కను రక్షించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. స్వాతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గన్నారం సుదర్శన్ లే అవుట్లో మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రమేష్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం ధన్నారం, రామయ్య గూడ, కొత్తగడి, ఆలంపల్లి ఎస్‌ఎల్బీ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, వికారాబాద్ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి.

బొంరాస్‌పేట: ఓటుహక్కు పట్ల ముమ్మరంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. శనివారం మండలంలోని తుంకిమెట్ల గ్రామ పంచాయతీ పోలింగ్ బూత్‌ను ఆయన పరిశీలించారు. తహసీల్దారు వెంకటేశ్‌కు పలు సూచనలు ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది ఓటునమోదుపై అవగాహన కల్పించాలన్నారు.

వంతెన కింద వ్యక్తి మృతదేహం లభ్యం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

ధారూరు: వంతెన పైనుంచి కిందకు తోసేసినట్లుగా పడిఉన్న శవం. శవం పక్కనే పడిఉన్న బైక్. ఈ విషయమై శనివారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామానికి చెందిన రాఘవేందర్(24) బైక్‌పై శుక్రవారం గ్రామం నుంచి వికారాబాద్‌కు వెళ్తున్నాడు. ధారూరు మండలంలోని బాచారం సమీపంలోని వంతెన వద్ద బైక్ అదుపుతప్పి పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదవశాత్తు వంతెనపై నుంచి పడి చనిపోయడా.. లేక ఎవరో హత్యచేసి శవాన్ని, బైక్‌ను వంతెనపై నుంచి కిందకు పడేసి పారిపోయారా అనే కోణంలో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. శవ పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జాబ్‌మేళాలో 782 మందికి ఉద్యోగాలు

పరిగి: మెగా జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని కాసాని ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని కొప్పుల శారద గార్డెన్‌లో నిరుద్యోగ యువతీయువకుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలలో 100వరకు కంపనీలో పాల్గొనగా మొత్తం 1600 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 782 మందికి ఉద్యోగాలకు ఎంపికైనట్లు వీరేశ్ తెలిపారు. టీడీపీ సాంస్కృతిక కళా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రహాస్, నాయకులు మాణిక్యం, బాబు, శ్రీశైలం, భాస్కర్‌గౌడ్, మాసయ్య పాల్గొన్నారు.



పెద్దేముల్: చేవెళ్ల సభకు తరలుతున్న కాంగ్రెస్ నాయకులు

కదంతొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేవెళ్లలో శనివారం నిర్వహించిన ప్రజాగర్జన సభకు జిల్లా నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్‌తో పాటు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఈ సభ నుంచి ఆ పార్టీ ముఖ్య నేతలు పిలుపునివ్వనున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నిల్లో వికారాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తంచేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



మోమిన్‌పేట: ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



మర్పల్లి నుంచి..



దోమ: బొంపల్లి నుంచి వెళ్తున్న నేతలు..



యాలాల: ముద్దాయిపేట నుంచి..



కుల్కచర్ల నుంచి వెళ్తున్న నాయకులు



దౌల్తాబాద్: ఐక్యత చాటుతున్న నాయకులు

ఐదు ఫోన్ల రికవరీ



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న పోలీసులు

అనంతగిరి: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వికారాబాద్ పోలీసులు ట్రాక్ చేసి బాధిత ఫిర్యాదుదారులకు శనివారం వారి ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ టంగుటూరి శ్రీను, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు

మొక్కలతోనే మానవ మనుగడ

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



అనంతగిరి: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

అనంతగిరి: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మెగా ప్లాంటేషన్‌లో భాగంగా శనివారం వికారాబాద్ మండలంలోని పులమద్ది గ్రామంలో చేపట్టిన హరితహారంలో ఆయన పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఎంపీపీ చంద్రకళ, సర్పంచ్ మాధవరెడ్డి, ఎంపీడీఓ సత్తయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ శ్రీను, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కమల్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు గయాజ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి..

అనంతగిరి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. వికారాబాద్ మండల పరిధిలోని పులమద్ది గ్రామంలో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజితత్‌రెడ్డి ప్రజల కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన చేవెళ్ల ఆరోగ్య రథాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ మాధవ రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కమల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేద్దాం..

మర్పల్లి: తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్‌ను మూడవ సారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో క్యాంపు కార్యాలయంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, సహకార సంఘం డైరక్టర్ యాదయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, సహకార సంఘం డైరక్టర్ యాదయ్య, బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ మధుకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.